క్లుప్తంగా

ప్రారంభమైన కొప్పోల్ జాతర



పూజలు నిర్వహిస్తున్న బ్రాహ్మణులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని ఉత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో మొదటి రోజు పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం, అగ్నిప్రతిష్ఠాపన, దుర్గాభవానికి అభిషేకం, మహాపూజ, కుంకుమ పూజ తదితర కార్యక్రమాలను బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. శనివారం మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు.

పరీక్ష ప్యాడ్ల అందజేత



ప్యాడ్లు అందిస్తున్న ఎంపీపీ రాజు నాయక్

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు ఇష్టంతో శ్రద్ధగా చదివి అభివృద్ధి చెందాలని ఎంపీపీ రాజునాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రాయిలాపూర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బీఆర్‌ఎస్ పార్టీ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్ పరీక్ష ప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖులు, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పీర్లతండా సర్పంచ్ శ్రీజ, మండల అధ్యక్షుడు రామాగౌడ్, మాజీ సర్పంచ్ సంజీవ్ భూషణం, మాజీ ఉపసర్పంచ్ సంజీవ్, నాయకులు శంకర్, సంతోష్, బాలకృష్ణ, వెంకటేశం, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సరిత, ఉపాధ్యాయులు పెంటయ్య, మార్కండేయ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు బారికేడ్ల పంపిణీ



బారికేడ్లను అందిస్తున్న ప్రజాప్రతినిధులు

పెద్దశంకరంపేట(మెదక్): పేట పోలీస్‌స్టేషన్‌కు ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దత్తు శుక్రవారం నాలుగు బారికేడ్లను ఉచితంగా అందజేశారు. ఈ మేరకు ఎస్‌ఐ బాలరాజు మాట్లాడుతూ.. ఉమాసంగమేశ్వర దేవాలయం కొప్పోల్‌లో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా వీటిని వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు అడివయ్య తదితరులున్నారు.

పందులతో పరేషాన్

నర్సాపూర్: నర్సాపూర్‌లోని 15వ వార్డులో పందులు ఎక్కడ పడితే అక్కడ మరణిస్తున్నాయని వార్డు కౌన్సిలర్ లలిత చెప్పారు. తమ వార్డు పరిధిలో పలు చోట్ల పందులు తిరుగుతూ మరణిస్తున్నాయని చెప్పారు. పందులు ఎక్కువ సంఖ్యలో మరణించడంతో రోగాలు వస్తాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు



పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని సదాశివపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం వైద్య సిబ్బంది ఏఎన్‌ఎం సుగుణ పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పరీక్షలు చేశారు. అలాగే మందులు అందించారు. అవసరం ఉన్నవారికి వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చారు. అంగన్‌వాడీ టీచర్ యాదమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న వీరేశం

నర్సాపూర్: సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం పలు కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేశం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి రక్తదానం చేశారు.

ఆలయాలు ముస్తాబు

- శివరాత్రి పూజలకు సిద్ధమైన శైవ క్షేత్రాలు
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

కొల్చారం(నర్సాపూర్): శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా శైవ ఆలయాలు ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. మండల కేంద్రంలోని వీరభద్రాలయం, రంగంపేటలోని సంగమేశ్వర ఆలయాల్లో ఈ వేడుకలు వైభవంగా జరగనున్నాయి. అర్ధరాత్రి నుంచి శివలింగాలకు అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రంగంపేటలోని సంగమేశ్వర ఆలయంలో సాయంత్రం శివపార్వతుల కల్యాణ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. శ్రీ గురు మదనానంద సరస్వతీస్వామి వారి ఆశ్రమంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఉంటాయని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని చెట్లగౌరారం గ్రామ శివారులోని చెల్మనాయ గుట్ట దేవాలయం వార్షిక వేడుకలకు సిద్ధమైంది. శివరాత్రి సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ నర్సయ్య, ఉప సర్పంచ్ శ్రీహరిగౌడ్‌లు తెలిపారు.

నేడు పెద్దచింతకుంటలో దుర్గమ్మ జాతర

నర్సాపూర్ రూరల్: మండలంలోని పెద్దచింతకుంటలో శనివారం దుర్గమ్మ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 18న బోనాలు, 19న నిండు బండ్లు, 20న పాచి బండ్లు, 21న వ్రతం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు అందరూ రావాలని నిర్వాహకులు కోరారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని ఉమామహేశ్వరస్వామి, గూడూర్‌లోని సోమేశ్వరాలయం, పెద్దగొట్టిముక్లలోని సంఘమేశ్వరస్వామి, గోమారంలోని రామేశ్వరాలయంతో పలు గ్రామాల్లోని శివాలయాలు ముస్తాము అయ్యాయి.



కొల్చారం(నర్సాపూర్): వేడుకలకు ముస్తాబైన రంగంపేటలోని సంగమేశ్వరాలయం



నర్సాపూర్ రూరల్: ఆలయంలో కొలువైన అమ్మవారు



మనోహరాబాద్(తూప్రాన్): ముస్తాబైన చెల్మనాయగుట్ట

కార్యకర్తలకు అండగా పార్టీ సభ్యత్వ బీమా

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దశంకరంపేట మండలంలోని మక్తలక్ష్మాపూర్‌కు చెందిన రామయ్యగారి సతీష్ ఇటీవల మరణించాడు. దీంతో అతడి కుటుంబానికి మంజూరైన పార్టీ సభ్యత్వ బీమా రూ.2 లక్షల చెక్కును అతడి తల్లి పాపమ్మకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచ్ కవితా రమేశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అశోక్, నాయకులు యాదయ్య, పిట్ల రమేశ్, పల్లె రవి తదితరులున్నారు.



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ప్రజల సంక్షేమమే లక్ష్యం



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఎక్కడ లేని పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు సంధ్య, సర్పంచ్ సుగుణ, ఎంపీటీసీ వాణి తదితరులు ఉన్నారు.

పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని హెచ్‌ఎం లలితాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంగా హారిక, జిల్లా కలెక్టర్‌గా గోవింద్‌చారి, డీఈఓగా రాకేష్, ఉపాధ్యాయులుగా సాయితేజ, శివాని, రేవతి, వైష్ణవి, కీర్తన, శివానీ, పద్మ, వర్ష, సుధాకర్, రాజేశ్, సిద్ధూ, విగ్నేష్, రాము తదితరులు విధులు నిర్వర్తించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ జగన్, పీడీ రమేష్, ఉపాధ్యాయులు రాధకిషన్, శేఖరిగారావు, షేక్‌బాబు తదితరులు పర్యవేక్షించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

పద్మశాలి సంఘం నాయకులపై దాడి సరికాదు



మాట్లాడుతున్న నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): పద్మశాలి సంఘం నాయకులపై దాడిచేయడం సరికాదని మండల పద్మశాలి సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం కౌడిపల్లిలో మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పిస్కె నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షుడు పిస్కె శెట్టయ్య, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు తిరుమలేశ్ మాట్లాడుతూ.. సంఘం సభ్యత్వంలో భాగంగా కామారెడ్డి జిల్లా దోమకొండకులో అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడం బాబురావు, మెదక్ జిల్లా అధ్యక్షుడు మ్యాకలు జయరాములు వెళ్లగా, అదే గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం నాయకుడు నర్సింలు దాడి చేయడం సరికాదన్నారు. పద్మశాలీల ఐక్యత కోసం అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కృషి చేస్తున్నారని తెలిపారు. కాగా కొన్ని సంఘాల నాయకులు పద్మశాలీల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు పద్మ దుర్గయ్య, ఆంజనేయులు, మంత్రి కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నర్సాపూర్‌రూరల్: వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే శాస్త్రవేత్త రవి అన్నారు. మండలంలోని ఇబ్రహీంబాద్ రైతు వేదికలో వరిపంటలో ఆశించిన చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వరిలో మొగిపురుగు, ఎండు తెగులు, జింక్ లోపం లక్షణాల నివారణకు చర్యలు, సేంద్రియ పద్ధతిలో సాగు విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్, విస్తరణ అధికారి తేజస్విని, శిరీష, రూతు, ప్రసాద్, సింధు, సర్పంచ్ సత్యనారాయణ, ఉప సర్పంచ్ పోచయ్య, రైతుబంధు సమితి కో ఆర్డినేటర్స్ కొండల్‌రెడ్డి, సత్తయ్య, రైతులు మల్లారెడ్డి, శివ్వయ్య, లక్ష్మణ్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త రవి

ఆర్టీసీ ప్రత్యేక క్యాంపు ప్రారంభం

కొల్చారం(నర్సాపూర్): మహాశివరాత్రి ఏడుపాయల వనదుర్గాదేవి జాతరను పురస్కరించుకొని మెదక్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మండలంలోని పోతంశెట్టిపల్లి ఉరవగడ్డపై ఆర్టీసీ ప్రత్యేక క్యాంపును ఆర్‌ఎం సుదర్శన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. మొత్తం 136 బస్సులను మెదక్, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, హైదరాబాద్, బాలానగర్ ప్రాంతాల నుంచి, అలాగే అమ్మవారి సన్నిధికి వెళ్లేందుకు 5 ప్రత్యేక ఉచిత బస్సులను నడుపుతున్నామన్నారు. డిప్యూటీ ఆర్‌ఎం దైవాదీనం, డీఎం రవి చందర్, మల్లేశం, సిబ్బంది పాల్గొన్నారు.



క్యాంపును ప్రారంభిస్తున్న ఆర్‌ఎం సుదర్శన్

పాఠశాలల్లో సీసీఈ మార్కుల పరిశీలన

చిలప్‌చెడ్(నర్సాపూర్): పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతమైన మార్కులు సాధించాలని సీసీఈ (నిరంతర సమగ్ర మూల్యాంకనం) పరిశీలన అధికారి విఠల్ అన్నారు. శుక్రవారం మండలంలోని గౌతాపూర్, ఫైజాబాద్ గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో సీసీఈ మార్కులు పరిశీలించారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ.. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు తన బృందం గంగాధర్, రతన్‌లతో కలసి సీసీఈ మూల్యాంకనం పరిశీలించామన్నారు. పదవ తరగతి విద్యార్థులకు 20 మార్కులకు గానూ పాఠశాలలో ఇంటర్నల్ పరీక్షలు నిర్వహిస్తారని, ఆ పరీక్షలకు సంబంధించిన రిజిస్టర్లు, విద్యార్థుల నోట్ పుస్తకాలు, పరీక్షాపత్రాలు తదితర వివరాలు పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫైజాబాద్‌లో రిజిస్టర్లు పరిశీలిస్తున్న దృశ్యం

ఇష్టపడి చదివితే లక్ష్యం సాధిస్తాం



మాట్లాడుతున్న ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే లక్ష్యాన్ని సాధిస్తామని ఎంపీపీ స్వరూప, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ రాయరావు సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వేడుకలకు వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు మిన్నంటాయి. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రతిభ పురస్కార బహుమతులు అందజేశారు. అనంతరం ప్రతి ఒక్కరూ నిర్ణీత గమ్యాన్ని ఏర్పాటు చేసుకొని, ప్రణాళికతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని పలువురు వక్తలు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసులు, స్థల దాత డా. వెంకటేశ్వర్‌రావు, ఎంపీటీసీలు మోహన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, బాబు కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి

పెద్దశంకరంపేట(మెదక్): బూత్ స్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్, మండల పరిశీలకులు రామకృష్ణ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లి, నారాయణపల్లి గ్రామాల్లో కార్నర్ మీటింగ్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మంగళి కృష్ణ, శ్రావణ్‌కుమార్, ఆర్.సాయిలు, కృష్ణ, విశ్వనాథం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విఠల్

ఘనంగా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

జిల్లావ్యాప్తంగా శుక్రవారం సీఎం కేసీఆర్ పుట్టిన రోజును ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సీఎం జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి అభిషేకం నిర్వహించారు. అలాగే పలువురు కేక్ కట్ చేసి, ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.



నర్సాపూర్: సీఎం చిత్రపటానికి అభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో..



పెద్దశంకరంపేట(మెదక్): పేటలో ..



రామాయంపేట(మెదక్): నార్సింగిలో..



వెల్దుర్తి(తూప్రాన్): కేక్ కట్ చేస్తున్న నాయకులు



శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో..



చేగుంట(తూప్రాన్): ఎంపీడీఓ కార్యాలయంలో..



మనోహరాబాద్(తూప్రాన్): కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్ పాఠశాలలో ..



కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ..



చిన్నశంకరంపేటలో..



తూప్రాన్‌లో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, నాయకులు